


## గణనాథునికి రాళ్ళు పొదిగిన బంగారు బొట్టు విరాళం





కాణిపాకం, డిసెంబర్ 21 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి రాళ్ళు పొదిగిన బంగారు బొట్టును బుధవారం ఓ దాత విరాళంగా అందజేశారు. గుంటూరుకు చెందిన అజయ్‌కుమార్ అనే భక్తుడు 2.20 లక్షల రూపాయల వ్యయంతో బంగారుతో రాళ్ల పొదిగి ప్రత్యేకంగా తయారు చేయించిన బొట్టును దాత కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈబొట్టును ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణిలకు అందజేశారు. దాతలకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## నేడు తుమ్మలగుంటకు సిఎం జగన్ రాక



తిరుపతి రూరల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త
రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం సాయంత్రం తిరుపతికి రానున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం పారుమంచాల గ్రామం జూపాడు బంగ్లాలో టిటిడి ఈవో ధర్మారెడ్డి, వారి కుటుంబసభ్యులను కలిసి వారి కుమారుడిని మృతికి సంతాపం తెలుపుతారు. అనంతరం ఓర్వకల్ ఎయిర్పోర్ట్ చేరుకుని అక్కడి నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి 5.10 చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తుమ్మలగుంటలోని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసానికి 5.40 గంటలకు చేరుకుని వారి తండ్రి మృతికి సంతాపం తెలుపుతారు. అనంతరం 6 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని 6.35 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి వెళ్లనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# పట్టపగలు దారుణ హత్య

### ఉపాధ్యాయనగర్‌లో దారుణం



హత్యకు గురైన చంద్రాచార్చి, ఇన్‌సెట్‌లో (ఫైల్‌ఫోటో)

శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణ పొలిమేరల్లోని కైలాసగిరి సమీపంలో ఉన్న ఉపాధ్యాయనగర్‌లో బుధవారం పట్టపగలు ఓ వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. హత్యకు సంబంధించి రకరకాల కథనాలు వినబడుతున్నాయి. ఉపాధ్యాయనగర్‌లో పూజారిగా వ్యవహరిస్తున్న చంద్రయ్యాచ్చారి వద్దకు రోజూ పలువురు వచ్చి పూజలు జరిపించుకునే వారు. అలాగే వాస్తును కూడా ఆయన చూసే వారని తెలిసింది. ఉపాధ్యాయ నగర్‌లో నివాసముంటున్న ఆతని కుటుంబం ప్రస్తుతం హత్య జరిగిన ఎదురుగా ఓ ఇంటిలో నివాసముంటున్నారు. బుధవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఎవరో పూజల పేర వచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలానికి టూటౌన్ సిఐ భాస్కర్‌నాయక్ ఎస్‌ఐ, వారి సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబసభ్యులను వాకబు చేసారు. చంద్రాచ్చారి ఎంత కాలంగా నివాసముంటున్నారు. ఆతని వద్దకు తరచూ ఎవరైనా వస్తున్నారా? అని విచారించారు.

**మంత్ర తంత్రాలే ప్రాణం మీదకు తెచ్చాయా?**

ఉపాధ్యాయనగర్‌లోని ఓ రేకుల షెడ్డులో గదినిర్మించుకొని దీనిని పూజా మందిరంగా మలచుకున్నారు. ఇతను ఇక్కడ మంత్ర, తంత్రాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఈ వృత్తియే ఆయన ప్రాణం మీదకు తెచ్చుకున్నారని భావిస్తున్నారు. ఇందుకు ఓ సంఘటన తార్కాణంగా ఉంది. చంద్రాచ్చారికి భార్య నిర్మల(45) కుమార్తె లీలావతి, కుమారుడు రుద్ర ఉన్నారు. వీరు రాజీవ్‌నగర్‌లో నివాసముంటున్నారు. చంద్రాచ్చారి (56) ప్రతి రోజూ ఉపాధ్యాయ నగర్‌లో పూజలు జరుపుకునే వారు. మంత్రాలు, తంత్రాలుచేసే వారు. ఈ నేపథ్యంలో మూడేళ్ళుగా నాయుడుపేటకు చెందిన ఓ వ్యక్తికి సంతానం కల్గలేదని చంద్రాచ్చారి వద్ద తాయత్తులు వేసేవారు. అంతేకాక తంత్ర పూజలు, వశీకరణలు చేసేవారని కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నాయుడుపేటకు చెందిన ఓ యువకునికి సంతానం కల్గుతుందని తాయత్తులు వేసారని, అలాగేవారి వద్ద భారీ ఎత్తున సొమ్ములు గుంజినట్లు చర్చించుకుంటున్నారు. ఈ విషయానికి సంబంధించి బాధితునికి చంద్రాచ్చారికి మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. బహుశా వారే హత్య చేసిఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో చంద్రాచ్చారి హత్యకు గురయ్యాడు. వెంటనే ఓ సెల్ ఫోన్ ద్వారా 108కు, పోలీసులు 100కు కూడా ఫోన్ చేసినట్లు చర్చించుకుంటున్నారు.

**డాగ్ స్క్వాడ్ పరిశీలన:**

సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం రావటం అలాగే 108కు సమాచారం రావటంతో పోలీసులు వీటి ఆధారంగా హత్య చేసిన వ్యక్తినే ఫోన్ చేసి ఉంటారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వెంటనే డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. పోలీసుల శునకం హత్యా స్థలం నుంచి శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలోని ఓ ప్రైవేటు ఉన్నత పాఠశాల వద్దకు వచ్చి నిలిచినట్లు సమాచారం. ఇక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వక్తిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆతన్ని పోలీసుజీప్‌లో ఎక్కించిన తరువాత పోలీసుల సునకం ఆతని వద్ద వచ్చినట్లు తెలిసింది. అయితే పోలీసుల విచారణలో హత్యకు దారి తీసిన సంఘటనలు వెలుగు చూడాల్సి ఉంది. టూటౌన్ పోలీసు స్టేషన్ సిఐ భాస్కర్‌నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యకు పేదల తలరాత మార్చే శక్తి

### విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు - డిప్యుటీ సిఎం నారాయణస్వామి



8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త:
విద్యకు పేదల తలరాత మార్చే శక్తి వుండటంతో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిప్యుటీ సిఎం నారాయణస్వామి అన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన జన్మదినం పురస్కరించుకొని బుధవారం 8వ తరగతి విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమంను బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయి కార్యక్రమంను చిత్తూరు బిఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిఢ్యుటీ సిఎం నారాయణస్వామి, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ హరినారాయణన్, మేయర్ అముద తదితరులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లాలో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులు, తల్లిదండ్రులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంను చిత్తూరు నుండి విద్యార్థులు వర్చువల్ విధానంలో వీక్షించారు. ఈ సందర్భంగా డిప్యుటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అదించడానికి విద్యారంగంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న 4,59,564 విద్యార్థులు, 59,176 మంది ఉపాధ్యాయులకు 1,466 కోట్ల రూపాయలతో బైజూస్ కంటెంట్‌తో కూడిన 5,18,740 ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం వారం రోజుల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఐశ్వర్యవంతులతో సమానంగా విద్యను అభ్యసించి ప్రపంచ వ్యాప్తంగా రాణించాలని ఒక మేనమామగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దేశం, రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతిలో వుండటంతో దీనిని దృష్టిలో వుంచుకొని విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో రాణించాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ విద్యా విధానంలో అనేక మార్పులు తీసుకురావడంతో పాటు విద్యార్థుల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో నాడు-నేడు కార్యక్రమంకు శ్రీకారం చుట్టి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రైవేటు విద్యార్థులతో సమానంగా పేద విద్యార్థులు వుండాలని భావించి జగనన్న విద్యాకానుక ద్వారా 3 జతల యూనిఫాం, షూస్, బ్యాగ్, బెల్ట్ తదితరాలను అందిస్తున్నారన్నారు. 75 శాతం హాజరు వున్న ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో అమ్మఒడి పథకం కింద 15 వేల రూపాయలు జమ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు 32 వేల రూపాయల విలువైన బైజూస్ కంటెంట్ వున్న ట్యాబ్‌లను పంపిణీ చేస్తోందన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాసులు మాట్లాడుతూ మూడేళ్ళుగా రాష్ట్రంలో విద్యా విధానంలో వచ్చిన మార్పులు, పరిపాలనా విధానంను పలు రాష్ట్రాలు సిఎంను ప్రసంశిస్తున్నా యన్నారు. డిఇఓ విజయేంద్రరావు మాట్లాడుతూ పాఠశాల విద్యలో మరో విప్లవాత్మక మార్పుకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, సమగ్ర శిక్ష అడిషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి, చిత్తూరు డిఐఇఓ చంద్రశేఖర్‌రెడ్డి, సమగ్ర శిక్ష సిఎంఓ గుణశేఖర్‌రెడ్డి, ఐఇ కోఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ, ఎఎల్ఎస్ కో-ఆర్డి నేటర్ అజయ్‌కుమాం రెడ్డి, ఎంఇఓ సెల్వరాజ్, జడ్పీటిసీలు, కార్పొరేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి రోజా



నగరి, డిసెంబరు 21 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరిగింది. మంత్రి రోజా ముఖ్యమంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అగ్రస్థానం లక్ష్యంగా సిఎం అడుగులు

### ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు కేక్ కట్ చేసిన జడ్పీ ఛైర్మన్



జడ్పీ కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేస్తున్న జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త:
రాష్ట్రంను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయం ఆవరణలో సిఎం వైఎస్ జగన్ 50వ జన్మదినం సందర్భం పురస్కరించుకొని బుధవారం జడ్పీ ఛైర్మన్ మొదట దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దడానికి సిఎం బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేసే కార్యక్రమంకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా జడ్పీ ఛాంబర్ ఛాంబర్‌లో మృతి చెందిన నలురుగు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సాంఘీక భద్రత పథకం కింద జీవనోపాధి కల్పిస్తూ ఉద్యోగ నియామక ఉత్తర్వులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, మహిళా శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతి మధుకుమార్, జడ్పీటిసీలు సుచిత్ర(ఐరాల), దేవిక(పూతలపట్టు), వైకాపా చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు వల్లివేడు రాజారెడ్డి, జడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పలమనేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతిమయం!



పలమనేరు, డిసెంబరు 21, ప్రభాతవార్త:
పలమనేరు సబ్‌రిజిస్టరు కార్యాలయం అవినీతికి నిలయంగా మారింది. ప్రతి రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వ విలువపై 1శాతం ముడుపులు చెల్లించందే రిజిస్ట్రేషన్ కాని పరిస్థితి కార్యాలయంలో నెలకొంది. కార్యాలయ ఆవరణలో డాక్యుమెంట్ రైటర్ల ద్వారా ప్రతి రిజిస్ట్రేషన్‌కు భారీ మొత్తంలో నగదు చేరిన అనంతరం రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తునట్లు సమాచారం. పలమనేరు సబ్ రిజిష్టర్ కార్యాయంలో ప్రతి రోజు వందల సంఖ్యలో డాక్యుమెంటు రిజిష్టరు కావడం జరుగుతుంది. ప్రతి రిజిస్ట్రేషను అక్కడి డాక్యుమెంట్ రైటర్లు లేనిదే జరగని పరిస్థితి ఉంది. గతంలో డాక్యుమెంట్ రైటర్లను అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ కొరకు వచ్చిన వారి వద్ద నగదు దండుకుంటున్నారని విమర్శలు రావడంతో అప్పటి అధికారులు వారిని నియంత్రించారు. ప్రస్తుతం పదుల సంఖ్యలో రైటరు వారు లేనిదే కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు కాని పరిస్థితి నెలకొంది. ముందుగా డాక్యుమెంటు విలువ నమోదుతోనే కార్యాలయంలోని సిబ్బంది రైటర్లకు కార్యాలయానికి చేరవలసిన 1 శాతంను తెలపడం దాని ప్రకారం రైటర్లు నగదు అందించి రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరుగుతుందని సమాచారం. డాక్యుమెంటు, భూమి వివరాలు సక్రమంగా ఉంటే ప్రభుత్వ విలువపై 1శాతం లేకుంటే 2 శాతం కార్యాలయానికి తప్పనిసరి చెల్లించాలంటూ రైటర్లు తేల్చి చెప్పడం దాని ప్రకారం రిజిస్ట్రేషన్లు అనుమతించడం పలమనేరు కార్యాలయంలో ఆనవాయితీగా ఉంది. అధికార పక్షం, ప్రతిపక్షం, ధనిక, పేద అన్న బేదాలు లేకుండా ప్రతి ఒక్కరు కార్యాలయంలో ముడుపులు చెల్లించాల్సి ందేనంటు, ఎందుకు అని ప్రశ్నిస్తే డాక్యుమెంటు సరిగ్గాలేదు, భూమి రికార్డులు సక్రమంగా లేదు అంటు ఏవో కారణాలు చెబుతూ రిజిస్ట్రేషన్ చేవడంలేదని బాధితులు వాపోతున్నారు. గతంలో పలమనేరు సబ్ రిజిష్టరు కార్యాలయం పలు విమర్శలపాలైంది. ప్రస్తుతం రిజిష్టరు కార్యాయంలో రిజిస్ట్రేషన్ కొరకు వచ్చివ వారి వద్ద నుండి లక్షల రూపాయలు దోచుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు. ఏదేమైనప్పటికి ఉన్నత స్థాయి అధికారులు చర్యలు తీసుకొకుంటే ప్రజలు మరింత ఇబ్బందులకు గురికావడంతో పాటు తీవ్రంగా నష్టపోక తప్పదు.

### ఉష్ణోగ్రతలు

21/12/2022



- తిరుపతి 26 డిగ్రీలు
- చిత్తూరు 28 డిగ్రీలు
- మదనపల్లి 23 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 28 డిగ్రీలు
- వెంకటగిరి 29 డిగ్రీలు
- గూడూరు 29 డిగ్రీలు

### బంగారం ధరలు

21/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,115

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,580

### కోడిగ్రుడ్ల ధరలు

21/12/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## లోకం వీడిన చంద్రమౌళి!

### ఆస్పత్రిలో చికిత్సపొందుతూ కన్నుమూత
### అత్యాధునిక వైద్యానికి సహకరించని శరీరం



చంద్రమౌళి (ఫైల్‌పోటో)

తిరుమల, డిసెంబర్ 21ప్రభాతవార్తప్రతినిధి:
తీవ్ర గుండెపోటుకు గురై మూడురోజులు మృత్యువుతో పోరాడిన యువకుడు ఏవి చంద్రమౌళి(28) చివరకు బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. తమిళనాడు చెన్నై కావేరీ ఆస్పత్రిలో గత ఆదివారం మధ్యాహ్నం నుంచి చికిత్స పొందుతూ కొన్ని గంటల ముందు లోకాన్ని విడచిపెట్టాడు. కావేరీ ఆస్పత్రి వర్గాలు బుధవారం ఉదయం 9గంటలకు చంద్రమౌళి మృతిచెందినట్లు వెల్లడించాయి. ఆదివారం నుంచి ఆస్పత్రి వర్గాలు యువకుడిని బ్రతికించడానికి విశేష కృషి చేసినప్పటికీ ఆయన అవయవాలు వైద్యంకు సహకరించకపోవడంతో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కుమారుడి మృతదేహం వద్ద ఆయన తండ్రి, టిటిడి ఇఓ ఏవిధర్మారెడ్డి కన్నీటి పర్యంత మయ్యారు. తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. మరోనెలరోజుల్లో కుమారుడి పెళ్ళి జరగాల్సి ఉండగా ఈ విషాదం అలముకోవడంతో ఆ కుటుంబంలో దు:ఖం నెలకొంది. ఆదివారం నుంచి బుధవారం ఉదయం వరకు వైద్యులు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. చంద్రమౌళి ఆరోగ్యంగాతిరిగి రావాలని, దేవునిఆశీస్సులు ఉండాలని కోరుతూ టిటిడి ఉద్యోగులు, అభిమానులు ఆతని ఆరోగ్యం కుదుటపడాలని పూజలు చేసినా దేవుడు మొరవినలేదు. చెన్నైలోని స్థానిక టిటిడి ఆలయ సలహామండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి కుమార్తెతో మూడునెలల క్రిందట వివాహ నిశ్చయమైన విషయం విదితమే. అయితే విధి వక్రించడంతో గుండెపోటు కారణంగా యువకుడు అందరినీ వదలివెళ్లడంతో టిటిడి వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాయి. టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే, తుడ ఛైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బోర్డు సభ్యులు, ఎమ్మెల్యేలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ధర్మారెడ్డి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని దేవుడిని ప్రార్థించారు. సిపిఎం నేతలు కందారపు మురళి, సుబ్రమణ్యం, జగన్మోహనరావు, కృష్ణయ్య తదితరులు బుధవారం మధ్యాహ్నం చెన్నైకు వెళ్లి ఇఓ ధర్మారెడ్డిని పరామర్శించారు.

## దుకాణంలోకి దూసుకెళ్లిన కారు

### -ఒకరికి గాయాలు



పలమనేరు, డిసెంబరు 21, ప్రభాతవార్త:
పట్టణంలో ఓ దుకాణంలోకి కారు దూసుకువెళ్లిన సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని మర్కస్ కాంప్లెక్స్ వద్ద ఓ మైనర్ బాలుడి నిర్లక్ష్యంతో కారు దుకాణంలోకి దూసుకువెళ్లింది. పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలుడు మర్కస్ కాంప్లెక్స్ వద్ద కారును నడుపుతూ అదుపుతప్పి ఒక్కసారిగా దుకాణంలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో దుకాణం వద్ద ఉన్న మూడు ద్విచక్రవాహనాలు పాక్షికంగా దెబ్బతినగా, దుకాణం వద్ద ఉన్న అలిబాషా(50)కు గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

## స్వామిఅమ్మవార్లకు పర్వతహారతి వితరణ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లకు బుధవారం హైదరాబాదుకు చెందిన వాస్తవ్యులు జి.విష్ణురెడ్డి, మౌళికలు సుమారు రూ.2,20,990లక్షలు విలువచేసే 108వెండి దీపాల పర్వతహారతిని ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులుకు అందించారు. అనంతరం దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనంతోపాటుచేసి తీర్థప్రసాదాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## విద్యావసరుల కల్పన ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్



సత్యవేడు, డిసెంబరు 21, ప్రభాతవార్త:
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావసరుల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సత్యవేడు ప్రభుత్వ పాఠశాలలో బైజూస్ డిజిటల్ పాఠ్యాంశాలు కలిగిన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే మెరుగైన సమసమాజ స్థాపన సాధ్యమౌతోందని అన్నారు. ఆదిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్‌కు దీటుగా విద్యావసతులు కల్పిస్తుండటం హర్షనీయమన్నారు. విద్యార్థులు విద్యావనరులను సక్రమంగా వినియోగించుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యామౌళిక వసతుల పునరుద్ధరణ జగనన్న కృషి ఫలితం అని అన్నారు. నియోజకవర్గంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కలిపి మొత్తంగా 3386 ట్యాబ్‌లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి విద్యార్థి భాగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్, యంపిపి, జడ్పీటీసి, నాయకులు, మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

**కుప్పం, డిసెంబర్ 21 ప్రభాతవార్త**

కుప్పం రెస్కో కార్యాలయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను రెస్కో ఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 50 కిలోల కేక్‌ను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో రెస్కో ఎండి సుబ్రమణ్యం, వైస్ ఛైర్మన్ వసుంధర కోదండరెడ్డి, రెస్కో అధికారులు ప్రభాకర్, మదన్‌మోహన్, దిలీప్, కృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు మణి, సయ్యద్‌అలీ, ఎంఆర్ సురేష్, రెస్కో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.అలాగే విక్టరీ బధిర పాఠశాలలో రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్‌చే పిల్లలకు అన్నదానం నిర్వహించారు.కార్యక్రమంలోకౌన్సిలర్‌ఇళయరాజా,మాజీగంగ మ్మగుడిఛైర్మన్‌ఉదయ్‌కుమార్, జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

**శాంతిపురం :** శాంతిపురంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వేడుకలను వైకాపా నేతలు ఘనంగా నిర్వహించారు. భారీ ఎత్తున కేక్‌ను ఎమ్మెల్సీ భరత్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, చెంగప్ప, ఎవిజయరాం, రఘురాంరెడ్డి, విజయ్‌కుమార్, పట్టాభి, మునిరత్నం గౌడు, వరదరాజులు, సైఫుల్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

**రామకుప్పం :** సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను రామకుప్పంలో వైకాపా నేతలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ విగ్రహంకు నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్సీ భరత్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచులు మురళి, రాజగోపాల్, సుబ్రమణ్యం, మల్లిక గోవిందప్ప, శ్వేత రాంబాబురెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, నారాయణస్వామి, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, క ృష్ణప్రసాద్, అప్పి, అబ్దుల్ గని, రాధాకృష్ణరెడ్డి, జయప్ప, సుబ్బారెడ్డి, చలపతి పాల్గొన్నారు.



# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సిఎం జగన్‌ను కలసిన రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్

**కుప్పం, డిసెంబర్ 21 ప్రభాతవార్త**



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కుప్పం రెస్కో ఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో సిఎంను కలసి పుష్పగుచ్చం అందించి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్‌ను సిఎం అభినందించారు. కుప్పంలో పార్టీ స్థితిగతులపై ఆరా తీశారు.

## తెదేపా నేత కనకరాజ్‌చే రోగులకు పళ్లు..బ్రెడ్ పంపిణీ

**కుప్పంరూరల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ నేత కనకరాజ్ బుధవారం కుప్పం ఏరియా ఆస్పత్రిలో రోగులకు పళ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. తనకుమార్తెజన్మదినం సందర్భంగా మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా సుమారు 500మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. సేవా కార్యక్రమాలు చేపట్టిన కనకరాజ్‌ను తెదేపా నేతలు అభినందించారు.

## తవణంపల్లెలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

**తవణంపల్లె, డిసెంబర్ 21 ప్రభాతవార్త:**



సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను మండలంలో బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగామండలవైకాపా సీనియర్ నాయకురాలు అరగొండ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో మండలంలోని అరగొండ పాత బస్టాండు నుండు భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల వైకాపా నాయకులుఅరగొండకిషోర్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిపార్థసారధిరెడ్డి, గోపిరెడ్డి, దిలీప్‌రెడ్డి, లోకనాథం, బుజ్జెమ్మ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ ఆలయంలో...**మండలంలోని పట్నం గ్రామంలో వైఎస్సార్ వీరాభిమాని పుట్టుకతో వికలాంగుడైన పట్నం రాజమాణిక్యం నిర్మించిన వైఎస్సార్ ఆలయంలో సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పట్నం గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో జగన్ పుట్టిన రోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు.

## తవణంపల్లెలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**తవణంపల్లె, డిసెంబర్ 21 ప్రభాతవార్త:**



మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ విజ్ఞాన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థిని, విద్యార్థులు తాము తయారు చేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈకార్యక్రమంకు ఎంఈఓ శంకరయ్య, పాఠశాల హెచ్‌ఎంశాంతిలుపాల్గొనిసంతృప్తివ్యక్తంచేశారు. ఈకార్యక్రమం లో ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు పెద్దరెడ్డి దేవరాజులు రెడ్డి, ఈజె విజయ కృష్ణారెడ్డి, సుహాసిన, చిట్టెమ్మ, లక్ష్మీ వైలజ, శ్రీలక్ష్మీలతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు

**కుప్పంరూరల్, డిసెంబర్ 21 ప్రభాతవార్త**



తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలను కుప్పంలో తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ మహిళా విభాగం నేతలు కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమాల్లో నేతలు సాంబశివం, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్,శాంతారాం, ఆర్ముగం, త్రిలోక్, కౌన్సిలర్లు సురేష్‌కుమార్, జాకీర్, తెలుగు మహిళ నేతలు అనసూయ, చంద్రకళ, వసంతమ్మ, సుగుణమ్మ,పద్మమ్మ, తిరుమగళ్, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మణి, మండల అధ్యక్షుడు సుబ్బు, వల్లెప్ప, పిఎస్ సతీష్, నరేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

**గుడిపాల, డిసెంబర్ 21 ప్రభాతవార్త:**

గుడిపాల ఎంపిపి కార్యాలయంలో బుధవారం ఎంపిపి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. వసంతాపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ రజనీకాంత్ ఆధ్వర్యంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ జనార్ధన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు రజనీకాంత్, శింబు, కారుమేఘం, ఇతర వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కల్లూరులో సీఎం జన్మదిన వేడుకలు

**కల్లూరు, డిసెంబరు 21 ప్రభాతవార్త**



పులిచెర్ల మండలం కల్లూరులో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మెన్ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాధ్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ఎస్ రెడ్డి ప్రకాష్, కాణిపాకం ఆలయ కమిటీ సభ్యుడు మువ్వల నరసింహులుశెట్టి, వైసీపీ నాయకులు వల్లివేడు రాజారెడ్డి, రాయల్‌మోహన్, సర్పంచిలు, ఎంపీటీసీ సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## జనరంజక పాలనకు కేరాఫ్ జగన్‌రెడ్డి : పెద్దిరెడ్డి

**చౌడేపల్లి, డిసెంబర్ 21 ప్రభాతవార్త**



రాష్ట్రంలో జనరంజక పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర వైకాపా కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జన్మదినాన్ని పురస్కరించుకొని మండల వైకాపా ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. 50కిలోల కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి మునితుకారామ్, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీసభ్యుడు కూరపర్తి అంజిబాబు, బోయకొండ ఛేర్మన్ మిద్దింటి శంకరనారాయణ, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణ్‌భరత్, ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపిలు రెడ్డిప్రకాష్, రుక్మిణమ్మ, శ్రీరాములు, మండలంలోని వైకాపా పాలకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆత్మబంధువు సిఎం జగనన్న- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

**కుప్పం, డిసెంబర్ 21 ప్రభాతవార్త**



రాష్ట్రంలోని పేద ప్రజల ఆత్మబంధువు సిఎం జగనన్న అని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం సిఎం జన్మదిన వేడుకల సందర్భంగా జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా స్థానిక పాతపేట చెరువు కట్ట వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాల్లో రెస్కో ఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, కౌన్సిలర్లు సయ్యద్ అలీ, నాగరాజు, మణి, ఎంఆర్ సురేష్, గణపతి, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, అజయ్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, అటవీ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలు

**పలమనేరు, డిసెంబరు 21 ప్రభాతవార్త:**



మండలంలో బుధవారం ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డిజన్మదినవేడుకలనువైకాపా నాయకులు,కార్యకర్తలు నిర్వహించా రు. పట్టణంలోని మార్కెట్ కమిటీ వద్ద ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ ఆధ్వర్యంలో భారీకేక్‌కట్‌చేశారు. ఉదయం అంబేద్కర్ సర్కిల్‌నుండివైకాపానాయకులు,కార్యకర్తలు ర్యాలీ గా స్థానిక మార్కెట్ కమిటీ వద్దకు చేరుకుని వైఎస్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలోమున్సిపల్‌చైర్‌పర్స న్‌పవిత్రమురళీక్రిష్ణ,నాయకులుఎస్‌కేఎస్‌జాఫర్,కౌన్సిలర్లుపాల్గొన్నారు

**పెద్దపంజాణి:**మండలంలోనిరాజుపల్లెపంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ నర్మధ నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి,ఎంపిటిసి కృష్ణప్ప,వైకాపా నాయకులు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైకాపా నాయకులు,కార్యకర్తలునిర్వహించారు.చిత్తూరు డిసిసి బ్యాంకు ఛైర్‌పర్సన్ రెడ్డెమ్మ,వైకాపా రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణమూర్తి,ఎంపిపి రెడ్డెప్ప,జెడ్‌పిటిసి కేశవులు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

## సిఎం పుట్టిన రోజు పురస్కరించుకొని రక్తదానం

**పాలసముద్రం, డిసెంబర్ 21 ప్రభాతవార్త:**



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం పురస్క రించుకొని పాలసము ద్రంలో వైకాపా నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరంను నిర్వహించారు. ఈశిబిరంలో 50 మంది వైకాపా కార్య కర్తలుపాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మండలవైకాపా అధ్యక్షుడు తులసీయాదవ్ స్వచ్ఛ భారత్ కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి సిఎం జన్మదిన సంబరాలు చేసుకొన్నారు. కార్యక్రమంలో పాలసముద్రం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మోహన్ కృష్ణ, సిహెచ్‌ఓ జ్ఞానశేఖర్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి శివప్రకాష్‌రాజ్, వైస్ ఎంపిపి శేఖర్‌మండడి, జడ్పీటిసి అన్బుగలన్, సర్పంచ్‌లు అయ్యప్పన్, గాలిమహేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా సిఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

**బంగారుపాళ్యం, డిసెంబర్ 21 ప్రభాతవార్త:**

సిఎం వైఎస్ జగన్మోహన్‌ఎడ్డి 50వ జన్మదిన వేడుకలు బుధవారం బంగారుపాళ్యంలో ఘనంగా నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. స్వయంభూ శ్రీ మొగిలీశ్వరాలయంలో సిఎం వైఎస్ జగన్ పేరిట ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. మొగిలి నుండి పాదయాత్రగా జాతీయ రహదారిపై వైకాపా నాయకులు, కార్యకర్తలు బంగారుపాళ్యం వరకు వచ్చారు. మొగిలి, గాండ్లపల్లి, బలిజపల్లి, పాలమాకులపల్లి, మొగిలి వెంకటగిరి తదితర గ్రామాల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం బంగారుపాళ్యం ముత్యాలమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపిలు శిరీష్‌రెడ్డి, జయకుమార్‌లు, ఎఎంసి ఛైర్మన్ నారే సోమశేఖర్, వైస్ ఛైర్మన్ సర్దార్, బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు ప్రకాష్‌రెడ్డి, దొరస్వామి, కృష్ణమూర్తి, ఎల్లప్ప, అమరనాథ్, మొగిలీశ్వర్, ఎంబి దిలీప్, భరత్‌రెడ్డి, అన్ను, దొరస్వామి, కామరాజు, నాగరాజు, మహేంద్ర, జగదీష్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, వివిధ మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పాత కక్షలతో వ్యక్తిపై దాడి - తీవ్ర గాయాలు

**వెంకటగిరి, డిసెంబరు 21, ప్రభాతవార్త:**



వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట చావిడి వీధికి చెందిన జనార్ధన్‌పై హరికృష్ణ కత్తితో దాడి చేసి గాయపరిచారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గత కొన్ని సంత్సరాలుగా పొట్ల జనార్ధన్ మరియు పిచ్చుక హరికృష్ణ మధ్య పాత కక్షల కారణంగా దాడి చేసినట్లు సమాచారం. గమనించిన స్థానికులు హరికృష్ణను అడ్డుకుని గాయపడ్డ జనార్ధన్‌ను వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జనార్ధన్ తీవ్రంగా గాయపడడంతోమెరుగైనచికిత్స కొరకుతిరుపతితరలించారు.పిచ్చుకహరికృష్ణపోలీసుస్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం. గత కొన్ని సంవత్సరాల క్రితం గ్రామంలో జరిగిన ఒక సంఘటన కారణంగా బయట ఉన్న జనార్ధన్ తల్లి మరణించింది అన్న నెపంతో బంగారుపేటకు విచ్చేసిన జనార్ధన్‌పై హరికృష్ణ విచక్షణా రహితంగా కత్తితో దాడి చేసి గాయపరిచారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎలక్ట్రికల్ షాపులో లక్ష రూపాయల సొత్తు చోరీ

**వెంకటగిరి, డిసెంబరు 21, ప్రభాతవార్త:**

పట్టణంలోని పాల కేంద్రం కూడలి వద్ద ఉన్న శ్రీ చెంచు మహాలక్ష్మీ ఎలక్ట్రికల్ షాపు నందు చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు షట్టరు పగులకొట్టి లోనికి ప్రవేశించి రూ.40వేల నగదు, రూ.30వేల విలువ చేసే వైర్లను అపహరించుకుని వెళ్లారు. మంగళవారం రాత్రి షాపు యజమాని ఆవుల కృష్ణయ్యషట్టర్ వేసుకుని ఇంటికి వెళ్లారు. బుధవారం షాపు తీసేందుకు రాగా షట్టరు పగులకొట్టి ఉన్నట్లు గుర్తించిదొంగతనంజరిగిందనిపోలీసులకుఫిర్యాదుచేశారు.పోలీసులుకేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**చిల్లకూరు డిసెంబర్ 21 ప్రభాతవార్త**



చిల్లకూరులోని డానియల్ చిల్డ్రన్ హోంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోన్‌రెడ్డి 50 వ జన్మదిన వేడుకలు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పేర్నాటి హేమసుష్మారెడ్డి,తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిలు భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం పిల్లలకు నోటిబుక్స్ అందజేశారు. పిల్లలకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో ప్రజాప్రతినిధులు నాయకులు,అధికారులు, జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, దువ్వూరు కిరణ్‌రెడ్డి, పాలూరు మాధవి, సుగుణమ్మ,తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్‌లో విద్యావిప్లవం ఎంపిపి అంజమ్మ

**కోట,డిసెంబరు 21 ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి పుట్టిన రోజు మంత్రులు, శాసనసభ్యుల మధ్య కాకుండా సిఎం కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారని కోట మండలాధ్యక్షురాలు దాసరి అంజమ్మ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుపతి వైకాపా జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమ్యూనిటి డెవలమెంట్ బోర్డు చైర్మెన్, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ వేడుకలను నిర్వహించారు. 50 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8 వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందచేశారని చెప్పారు. ఈ కార్యక్రమలో ఎంపిడివో మార్లెళ్ల భవాని, వైకాపా నాయకులు చేవూరి నాగేశ్వరరావు, నేదురుమల్లి హరిచంద్రారెడ్కిడ,నాగూర్ రెడ్డి, షనిల్ రెడ్డి, నేదురుమల్లి భరత్ రెడ్డి మద్దాలి డిఆర్ యువ సైన్యం నాగరాజు, ఊనుగుంటపాళెం సొసైటి చైర్మెన్, హనుమంత్ రెడ్డి,పుట్టానారాయణ, శివరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

**కోట,డిసెంబర్ 21 ప్రభాతవార్త**

ప్రభుత్వ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్సు కళాశాల మేనేజర్ కోటారెడ్డి రామకృష్ణారెడ్డి కోరారు. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కోట మండలం విద్యానగరలోని ఎన్‌బీకేఆర్ సైన్సు అండ్ ఆర్ట్సు కళాశాలలో సిఎం జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం విద్యాభివృద్ధికి బాటలు వేస్తోందని, అందుకు తగిన విధంగా విద్యార్థులు తయారు కావాలని కోరారు. అనంతరం విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ధృవీకరణ పత్రాలను అంద చేశారు. అనంతరం రంగోలి పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ ఆఫీసర్ గాది శ్రీనివాసులు, కోఆర్డినేటర్ రాజేష్,తదితరులు పాల్గొన్నారు.

# కోటలో సీఎం జగన్ జన్మదిన వేడుకలు

**కోట, డిసెంబర్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రం కోటలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కోట ప్రభుత్వాసుపత్రిలో నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తి చేశారని చెప్పారు. కులాలు, మతాలు, ప్రాంతాలు సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని చెప్పారు. మళ్లీ ఈ రాష్ట్రంలో మరో 30 ఏళ్లు జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని చెప్పారు.ఆయన వెంట తిరుపతి పార్లమెంట్ మైనార్టీసెల్ నాయకులు షేక్ మొబిన్‌బాషా, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ గాది భాస్కర్ తదితరులు ఉన్నారు.



## సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌తోనే సాధ్యం

నేదురుమల్లి హరిచంద్రారెడ్డి

**కోట,డిసెంబర్ 21 ప్రభాతవార్త**



కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను యువ నాయకుడు నేదురుమల్లి హరిచంద్రారెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 50 కిలోల కేక్‌ను హరిచంద్రారెడ్డి కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యమన్నారు. తన పాలనతో సీఎం ప్రజాకర్షక నేతగా ఎదిగారని కొనియాడారు.కట్టా శంకర్ రెడ్డి, నేదురుమల్లి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంక్రమణ వ్యాధులపై అవగాహన

**ఓజిలి, డిసెంబర్ 21, ప్రభాతవార్త**



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వీర్ల గునపాడు గ్రామంలో ఉన్న తాగు నీటి బావిని డాక్టర్ మాధవ్, డాక్టర్ శివ వీనిషా, మండల డెవలప్మెంట్ అధికారి రజినీకాంత్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చలపతి ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ సెక్రెటరీ కన్నా సుమ స్థానిక హెల్త్ అసిస్టెంట్ కన్నా వెంకటరమణయ్య, ప్రభాకర్ ఏఎన్ఎం ప్రమీల, వెల్ఫేర్ అసిస్టెంట్ పి. నగేష్, వాలంటీర్ మహేష్ రెడ్డి, వాటర్ మెన్ ఢిల్లీ రెడ్డి ఆశ సుజాతల ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ కన్నా వెంకటరమణయ్య బుధవారం బావి నీటి ప్రమాణాలను గణించి తగు మోతాదులో బ్లీచింగ్ పౌడర్‌ను పేస్ట్‌గా చేసి బావిలో కలిపారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చలపతి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు తగు జాగ్రత్తలు తదితర విషయాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## వాకాడులో ఘనంగా జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వాకాడు, డిసెంబర్ 21, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన వాకాడులోని బుధవారం ఏఎంసి కార్యాలయం ఆవరణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోధర్ రెడ్డి కేక్ కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచి పెట్టారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏఎంసీ కార్యాలయంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కొడవలూరు దామోదర రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని తెలిపారు. వాకాడు వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి సిఎంగా ఉన్నంత వరకు రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. జన్మదిన వేడుకల్లో సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, ఎంపిటిసి పి. కృష్ణారెడ్డి, సర్పంచ్ అనిల్ కుమార్ రెడ్డి, సర్పంచ్ కిషోర్ కుమార్, పాపా రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మహేంద్ర, సుధాకర్ నాయుడు, నాయకులు పెంచల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, భార్గవ రామ్, శివారెడ్డి, వెంకటయ్య, వాకాటి రవికుమార్, నూతనపాటి వెంకట రమణయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఎం జగన్ జన్మదిన వేడుకలు

**ఓజిలి, డిసెంబర్ 21, ప్రభాతవార్త**



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం ఓజిలి మండలంలోని ఓజిలి, పెద్ద పరియలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను బుధవారం వైఎస్ఆర్‌సిపి నాయకులు, ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బారావు యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎంపిపి గడ్డం అరుణారెడ్డి, జడ్పిటిసి సభ్యులు గుంట మడుగు రవీంద్ర రాజు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. వారి చేతుల మీదగా కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపిపి జి. అరుణ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు, గుంట మడుగు రవీంద్ర రాజు, ముమ్మడి సుబ్బారావు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో మహిళలు అందరూ సుఖ సంతోషాలతో ఉన్నారని, పది మందికి మేలు జరగాలనే తత్వం, నిండైన సేవాభావం కలిగిన భవిష్యత్ తరాల గురించి ఆలోచించే నాయకుడు ఒక్కడేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గడ్డం ఎంపిపి గడ్డం అరుణారెడ్డి, జడ్పిటిసి సభ్యులు గుంట మడుగు రవీంద్ర రాజు, ముమ్మడి సుబ్బారావు యాదవ్, ఎంపిడిఓ రజినీకాంత్, తహశీల్దార్ డి. లాజరస్, బాబు రెడ్డి, పి. హరినాథ్ రెడ్డి, ఉచ్చూరు హరి రెడ్డి, బట్ట బ్రదర్స్ అనిల్ కుమార్ యాదవ్, పృధ్వి కృష్ణ యాదవ్, మధురెడ్డి, దామోదర్ రాజు, వామన్ రాజు, ఖాధర్ భాషా, సుకుమార్ రాజు, ఫణిధర్ రెడ్డి, బి. కృష్ణయ్య గౌడ్, సర్పంచ్ గోవిందు, సుధా, మహిళ అధ్యక్షురాలు ప్రవీణ, ప్రసాద్ నాయుడు, పి. మధురెడ్డి, జాని భాష, గోవిందు, పోలయ్య, వెంకటరమణయ్య, ఉప సర్పంచ్ వెంకటరమణ రాజు, ప్రతాప్, వైసిపి నాయకులు, అధికారులు, మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలి ...ఏవో

**నాయుడుపేట రూరల్, డిసెంబరు 21 ప్రభాతవార్త:**

గ్రామాల్లో వ్యవసాయంసాగు చేపట్టే రైతులు ప్రతిఒక్కరు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని నాయుడుపేట వ్యవసాయశాఖ అధికారి గణేష్ తెలియజేశారు.ఆయన బుధవారం తిమ్మాజికండ్రిగ, చిగురుపాడు,మేనకూరు గ్రామాల్లో ముమ్మరంగా చేపడుతున్న ఈపంట నమోదును పరిశీలించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి గణేష్ మాట్లాడుతూ ప్రస్తుతం రబీసీజన్‌ల్లో నాయుడుపేట మండలంలో ఇప్పటి వరకు 8247ఎకరాల్లో రైతులు వరిపంటను సాగుచేయడం జరిగిందన్నారు.అందులో ఇప్పటి వరకు 1720ఎకరాల్లో ఈపంట నమోదు చేయడం జరిగిందన్నారు.గ్రామాల్లో ప్రతిరైతు తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు.వివిఎలు దెందీప్,వంశి,సాయి,రైతులు పాల్గొన్నారు.

## తెదేపా గెలుపే లక్ష్యంగా పనిచేయండి

**కోట,డిసెంబర్ 21 ప్రభాతవార్త**

రానున్న ఎన్నికల్లో తెదేపా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని గూడూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పాశంసునిల్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కోట మండలం చిట్టేడు గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. సునిల్‌కుమార్‌కు అడుగుడుగునా నీరాజనం పలికారు. పూలమాలతో ఘన స్వాగతం లభించింది.గతంలో గూడూరు శాసనసభ్యులుగా పనిచేసిన కాలంలో మీరు చేసిన అభివృద్ధి తప్ప మరి ఎక్కడా తట్ట మట్టి పోయలేదని తెదేపా కార్యకర్తలు ఆయన వివరించారు. ఆయన వెంట చెన్నయ్య, చంద్రశేఖర్, వెంకటరమణయ్య,అనిల్ తదితరులు ఉన్నారు.

# పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం - ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

**బాలాయపల్లి, డిసెంబరు 21, ప్రభాతవార్త:**

పేదల సంక్షేమమే సీఎం జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి,మాజీ సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, ఎంపీటీసీ సుజాత, వైసీపీ నేతలు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతిగా సీఎం నిలుస్తున్నారని తెలిపారు. దేశానికే ఆదర్శంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని మాజీ సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ వెందోటి కార్తీక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పావురపల్లి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



## పేదల గుండెల్లో దేవుడు జగన్మోహన్‌రెడ్డి

మాజీ ఎంఎల్ఏ ఎస్‌సివి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త

పేదల గుండెల్లో గూడు కట్టుకున్న యువ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. బుధవారం ఆయన ముఖ్యమంత్రి 50వ జన్మదినాన్ని పురస్కరించుకొని సామాజిక కార్యక్రమాల్ని ఏర్పాటు చేసారు. ఆయన నివాసం వద్ద కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా అనతి కాలంలో మన్ననలను పొందారన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంను అభివృద్ధి వైపు నడిపించుటలో సిఎం సహకారంతో స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి చొరవ చూపుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌సివి దిలీప్, మోహన్ కిషోర్ నాయుడు, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు నారాయణయాదవ్, మాజీ ఎంపిపి చంద్రయ్యనాయుడు, పఠాన్ ఫరీద్‌ఖాన్, భాస్కర్‌నాయుడు, మోహన్‌నాయుడు, మాజీ సర్పంచ్ హరినాయుడు, మాధవరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైకాపాలోకి వలసల జోరు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వైకాపా పార్టీలో వలసల జోరు సాగుతుంది. ఈ నేపధ్యంలో బుధవారం జగనన్న 50వ జన్మదినం సందర్బంగా సంబరాలను నిర్వహించారు. బుధవారం వైయస్‌ఆర్ సర్కిల్ వద్ద డాక్టర్ వైయస్‌రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం జరిపారు. ఇక్కడ ఆటో యూనియన్‌కు చెందిన 300 మంది ఎమ్మెల్యే మధుసూధనరెడ్డి సమక్షంలో వైకాపాలో చేరినట్లు ప్రకటించారు. పార్టీ కండువాను కప్పుకొని పార్టీ సభ్యత్వంను పొందారు. ఈకార్యక్రమాల్లో బిఎంఎస్‌ఆర్ యూనియన్ అధ్యక్షుడు సురేష్, అబ్బాస్, తయూబ్, రాము, బాజ్జి, దస్తగిరి, శ్రీను, సలీం, వవన్, సాయి, గోపి, సురేంద్ర, ప్రభాకర్, జుంలేషా తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటా! ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉంటానని శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. బుధవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సారధ్యంలో సన్మాన కార్యక్రమాలకు శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి ముఖ్యఅతిధిగా విచ్చేసారు. 15సంవత్సరాలు దాటిన వారిని సంఘం తరఫున 70మందికి సత్కరించి మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా శాసనసభ్యుని తో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీరాజ్‌శాఖ ప్రధాన కార్యదర్శి, మరియు శ్రీకాళహస్తి ఎపి ఎన్జీవో శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షులు చెంచురత్నం యాదవ్, గుమ్మడి బాల కృష్ణయ్య, అట్ల పురుషోత్తం గౌడ్, బూడిదవాకం వెంకయ్య, సమాజ అభివృద్ధి సేవకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు పాల్గొన్నారు.

## అన్నదానానికి విరాళం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యానదాన పధకానికి విరాళంగాచెన్నై వాస్తవ్యులు రాజ్‌కుమార్ మరియు కుటుంబ సభ్యులు కలసి రూ.98,501/-లు చెక్కును ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులకు అందించారు. అనంతరం దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనంతో పాటు తీర్ధప్రసాదాలను అందించి సత్కరించారు.

## నేడు ట్యాబ్‌ల బహుకకరణ

శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయం డిజిటల్ విప్లవం. రాష్ట్ర వ్యాప్తంగా 4.6లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ కంటెన్ట్‌తో ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ చేయాలని సిఎం నిర్ణయించారని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి వివరించారు. ఈ నేపధ్యంలో గురువారం ట్యాబ్‌ల పంపిణీ చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను ఆర్‌పిబియస్ జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలతో పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

## ఒక్క ఛాన్స్ అని రాష్ట్రాన్ని దోచుకున్నారు..సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, డిసెంబర్ 21 ప్రభాతవార్త



ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్, వైకాపా నాయకులు దోచుకుంటున్నారని నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బసవయ్యపాళెం గ్రామ పంచాయతీలో చేపట్టారు. ఈసందర్భంగా హాజరైన బొజ్జలసుధీర్‌రెడ్డికి మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, పలువురు నాయకులు స్వాగతం పలికారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలు గత తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, దివంగత నేతలు మాజీ మంత్రివర్యులు బొజ్జలగోపాలకృష్ణారెడ్డి మరియు పోతుగుంటగువరయ్యానాయుడులు సహకారంతో గ్రామంలో ఎస్సీ కాలనీ ఇండ్లు మరియు సిసి రోడ్లు, వీధిలైట్లు, స్కూలు బిల్డింగులు తప్ప గత ఈమూడు సంవత్సరాల్లో చేసేటటువంటి అభివృద్ధిఏమీలేదన్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్నా అభివృద్ధి జాడ కరువైందన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరాజనాయుడు, ప్రతాప్‌రెడ్డి, సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, జయచంద్రనాయుడు, రామకృష్ణమనాయుడు, విజయకుమార్‌నాయుడు, రాఘవులు, సునీల్, పాల్గుణ, భార్గవ్, కోదండం, వెంకటరమణ, సతీష్, మునెయ్య, సాంబ, హేమంత్, బాల, రాము, గురప్ప, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

తొట్టంబేడు, డిసెంబర్ 21 ప్రభాతవార్త

మండలంలోని 27 పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎంపిపి ఉన్నంనిర్మల, మండల వైకాపా అధ్యక్షుడు ఉన్నంవాసుదేవనాయుడులు బియ్యం, నిత్యావసర సరుకులను ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ద్వారా పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుధ్యంను చేపట్టే కార్మికులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బియ్యం, సరుకులు పంపిణీచేయడం ఎంతోసంతోషంగా ఉందని ఎంపిపి తెలిపారు. కార్యక్రమంలో తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, మాజీ ఎంపిపి కోవిచంద్రయ్యనాయుడు, సర్పంచ్, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నాలుగో వార్డులో ఇదేం ఖర్మ కార్యక్రమం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త



పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందని నియోజకర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ సారధ్యంలో పట్టణంలోని 4వ వార్డులో ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా సుధీర్‌రెడ్డి వార్డులో ప్రతి ఇంటికి వెళ్ళి మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కె.బాబు, చెంగయ్య, మూర్తి, సుబ్రమణ్యం, మణి, సుజిత్, నంద, బాలయ్య, సుధ, తిరుమలేశు, మురళీ, బాలయ్య, మరియు రాష్ట్ర, పార్లమెంటు కమిటీ సభ్యులు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇదేంఖర్మ మనరాష్ట్రానికి అనూహ్యస్పందన



తిరుపతి, డిసెంబర్ 21ప్రభాతవార్త:

రాష్ట్రంలో అధికార వైపిసి ప్రభుత్వ తీరు, ప్రజలను నమ్మించి పలు రకాల ధరలు పెంచి మోసగించిన విధానంపై "ఇదేంఖర్మమన రాష్ట్రానికి"కార్యక్రమం బుధవారం 33వ డివిజన్‌లో అనూహ్యస్పందన లభించింది. ఇన్‌ఛార్జి సుగుణమ్మ ఆధ్వర్యంలో డివిజన్ ఇన్‌ఛార్జి వి.పుష్పావతియాదవ్ నేతృత్వంలోటిడిపి నాయకులు నాగరాజునాయుడు, శ్రీనివాస్‌యాదవ్, రాజేంద్రుడు, ఈశ్వర్, వెంకటేశ్, పవన్, నాని, చందు, లోకేష్, రమణ, మోహన్, రవి, సత్యవతి, వట్టికుంట చినబాబు, మహేష్‌యాదవ్ తదితరులు ఇంటింటికెళ్ళి ప్రభుత్వ వ్యతిరేకత, పెంచిన ధరలు పై కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నారా బ్రహ్మణి జన్మదిన వేడుకలను జరుపుకుని, కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు.

## విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

సదుం, డిసెంబరు 21 ప్రభాతవార్త

సదుం మండలంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జోగివారిపల్లె, చెరకువారిపల్లె, నడిగడ్డ, బూరగమంద, యర్రాతివారిపల్లె, తిమ్మానా యనపల్లె, అమ్మగారిపల్లెల్లో ఆయా సర్పంచ్‌లు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు. సదుం బస్టాండులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ధనంజయరెడ్డి, కోఆప్షన్ మెంబరు ఇమ్రాన్, ఎంఈఓ శ్రీరాములు, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సోమల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, ఏపీఎం హరిప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## చెవిరెడ్డి మణిరెడ్డి మృతికి పులివర్తి నాని విచారం

చంద్రగిరి, డిసెంబర్ 21 ప్రభాతవార్త:

చంద్రగిరి ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి దివంగత చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (మణి రెడ్డి) మృతి పట్ల టిడిపి చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణి రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్ధించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అరాచక పాలనకు చరమగీతం

చంద్రబాబు రాకతోనే ప్రజలకు సుపరిపాలన, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని

చంద్రగిరి, డిసెంబర్ 21 ప్రభాతవార్త:



అధికార వైసిపి అస్తవ్యస్త అరాచక పాలనకు చరమగీతం పాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులివర్తి నాని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి" బుధవారం తొండవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వ తీరును వివరిస్తూ టిడిపిని ఆధరించాలని కోరారు. గ్రామంలోకి ప్రవేశించిన నానికి ప్రజలు బ్రహ్మరధం పట్టారు. యాదవ నాయకులు కంబలితో సత్కరించి మేకపిల్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తపసి సత్యనారాయణ రెడ్డి, నాయకులు మొక్కల కుమార్‌రాజారెడ్డి. పులికంటి మోహన్ రెడ్డి (బుజ్జి), సింగు సుధ, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, మణికంఠ యాదవ్, శంకర్ యాదవ్, మాజీ ఎంపిటిసి రవిచంద్ర, ఉమాపతి రెడ్డి, కొండూరు ప్రవీణ్ రాయల్, వీరంగారి రమేష్ రెడ్డి, సక్కూర్ ధనంజయ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాల యాదవ్, మధు, శేఖర్, లంకెళ్ళ లలిత, సునిత, అమ్ములు, నాయుడమ్మ, మల్లికమ్మ, రాధ సునీల్. రాధ, హరిప్రసాద్ యాదవ్, సుందరరామయ్య, లోకేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు వయోపరిమితి పెంచాలి!

-ప్రభుత్వానికి రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జేఏసి విజ్ఞప్తి



తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 21 ప్రభాతవార్త:

కరోనా మూడు సం॥ల కాలంలో ఉద్యోగాలు నియామకం జరగని కారణంగా పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ సెలక్షన్స్‌లో బలిజ అభ్యర్థులకు వయోపరిమితి పెంచి ఉపాధి పొందేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జేఏసి వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ రాయల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ లాక్ డౌన్ కారణంగా పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ సెలక్షన్స్ కోసం చాలామంది అభ్యర్థులు వేచి చూడటంతో వయో పరిమితి కాస్తా దాటి పోయింది. ఇప్పుడు విద్యార్హత ఉన్నా వయసు మీరడంతో ఉద్యోగాలకు అర్హత కోల్పోయారని, ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని వయోపరిమితి పెంచి సదరు అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాయల్ పీపుల్స్ ఫ్రంట్ జేఏసి ప్రతినిధులు గిరి వెంకటరమణ, గుండా వేణుగోపాల్ రాయల్, బెల్లంకొండ శ్రీనివాసులు రాయల్, ఇండ్ల నరసింహులు రాయల్, తిరుమలశెట్టి కిరణ్‌కుమార్ రాయల్, కంచన కృష్ణమూర్తి రాయల్, మాచర్ల రఘు రాయల్, జగదీష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

పుత్తూరు, డిసెంబరు 21 ప్రభాతవార్త :



ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పట్టణంలోని మదర్ థెరిస్సా బధిర పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ తదితరులు కేక్ కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం బైపాస్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆరేటమ్మ ఆలయంలో వంద కొబ్బరికాయలు కొట్టి ముఖ్యమంత్రి మరిన్ని జన్మదినోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## కృష్ణసముద్రంలో సిఎం జన్మదిన వేడుకలు

పుత్తూరు రూరల్, డిసెంబరు 21 ప్రభాతవార్త :



రూరల్ మండలంలోని కృష్ణసముద్రంలో బుధవారం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మునివేలు, సర్పంచ్‌లు కుమార్, హరీష్, నాయకులు నరసింహులు, బుజ్జి, రాజా, ప్రభు, సుదర్శనం, గోపి, షణ్ముగం, ఉదయం తదితర నాయకులు పాల్గొన్నారు. శిరుగురాజుపాలెం సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొని కేట్ కట్ చేశారు. నాయకులు రామకృష్ణాపురం సర్పంచ్ విరిత, నాయకులు దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఎం జగన్మోహనరెడ్డి జన్మదినం

విజయపురం, డిసెంబరు 21 ప్రభాతవార్త :



సిఎం జగన్మోహనరెడ్డి జన్మదినాన్ని బుధవారం వైకాపా నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని విజయపురంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు లక్ష్మీపతిరాజు కేట్ కట్ చేసి స్వీట్లు పంచారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలకు పండ్లు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పన్నూరు సబ్‌స్టేషన్‌లో మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, కోసలనగరంలో మరో సోదరుడు కుమారస్వామిరెడ్డి కేట్ కట్ చేసి స్వీట్లు పంచారు. గొల్లకండ్రిగలో వైసిపి నాయకులు జిల్లు తదితరులు పాళైత్తమ్మకు పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల వైసిపి అధ్యక్షుడు గోపినాథ్, వైస్ ఎంపిపి మంజు బాలాజీ, సింగిల్ విండో అధ్యక్షుడు హరిబాబునాయుడు, నాయకులు శేఖర్‌రాజు, చెంచువరప్రసాద్, ప్రకాష్‌రాజు, మురళీకృష్ణారెడ్డి, బాలకృష్ణనాయుడు, గోవర్ధన్‌నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

## అన్ని దానాల కంటే రక్తదానం మిన్న

డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్





పుత్తూరు, డిసెంబరు 21 ప్రభాతవార్త :

అన్ని దానాల కంటే రక్తదానం మిన్న అని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 20 మంది స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేశారు. రక్తదాతలను ప్రిన్సిపల్ అభినందించారు. 18 సంవత్సరాలు నిండిన ఆరోగ్యవంతులు ఏడాదికి రెండు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని ఎన్ఎస్ఎస్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ రఘురామ్, డాక్టర్ శ్రీనివాసులు, టి.నరసింహులు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు

తెలుగు మహిళా నాయకులు

విజయపురం, డిసెంబరు 21 ప్రభాతవార్త :

సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని వైకాపా నాయకులు దోచుకుంటున్నారని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా అన్నారు. బుధవారం మండలంలోని మాట, మంతి కార్యక్రమంలో భాగంగా జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు అరుణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, పుత్తూరు మునిసిపాలిటీ అధికార ప్రతినిధి బసంతిలు మండలంలో నాలుగు బృందాలుగా పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను మహిళలకు తెలిపారు. కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు నిరోషా, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారా బ్రాహ్మణి జన్మదినం

విజయపురం, డిసెంబరు 21 ప్రభాతవార్త :

మండలంలోని కోసలనగరంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మణి జన్మదినాన్ని బుధవారం టిడిపి కార్యకర్తలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టి సంబరాలు చేశారు. వారు మాట్లాడుతూ పార్టీలో యువత నూతన ఉత్తేజంతో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు, నాయకులు దశరధరాజు, బాలసుబ్రమణ్యంరాజు, చిన్నబ్బరాజు, సుధాకర్‌రాజు, దాము రాజు, మధునాయుడు, డిఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యవేత్త వెంకట్రామయ్యకు సన్మానం



తిరుపతి, డిసెంబర్ 21ప్రభాతవార్త:

కోల్హాపూర్ మహాలక్ష్మీ అమ్మవారి చరిత్రను తెనిగించి పుస్తకరూపం ద్వారా వెలుగులోకి తెచ్చిన సాహిత్యవేత్త యబ్బిలి వెంకట్రామయ్యను రాయలసీమ రంగస్థలి ఘనంగా సన్మానించింది. బుధవారం సాయంత్రం రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాలగోపీనాధరెడ్డి, కెఎన్ రాజు, అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, హేమచంద్, సురేష్‌స్వామి, గరికపాటి రమేష్ సన్మానించారు.

## కేవీబీపురంలో జగన్ జన్మదిన వేడుకలు

కేవీబీ పురం, డిసెంబరు 21 ప్రభాతవార్త:

మండలకేంద్రమైన కేవీబీ పురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ పేషెంట్లకు రొట్టెలు పంపిణీ చేశారు. వైఎస్ఆర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ రాయదుర్గం మునిలక్ష్మి, నందకుమార్, రాష్ట్ర హిస్టరి అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, మహిళా ఫైనాన్స్ డైరెక్టర్ వసంతలాల్ బాబుయాదవ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరుణ్, బీసీసెల్ మండల అధ్యక్షుడు అగ్రహారం హరిబాబురెడ్డి, మండల వైసీపీ మైనారిటీ నాయకులు జాకీర్ హుస్సేన్, వైస్ ఎంపీపీలు దేరాల కృష్ణయ్య, విట్టి సరస్వతి, జిల్లా పరిషత్ బోర్డు మెంబరు మూర్తి, మునెమ్మ, సుబ్బయ్య, మహిళా సభ్యురాలు బుర్ర మాధవిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షురాలు గాలి రమాప్రభ, మండల పర్వతాల బాలసుబ్రహ్మణ్యం, రాయపేడు హరి, లోకేష్, మండల యూత్ అధ్యక్షులు జగదీష్, సర్పంచ్ గిరి, ఎంపీటీసీ అయ్యప్ప, పలు వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎస్వీయూలో అంబరాన్నంటిన జగనన్న జన్మదిన సంబరాలు

తిరుపతి (విద్య), డిసెంబర్ 21, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నిరుపేద ప్రజల అభిమాన నాయకుడు, పేదల సన్నిధి, పేద విద్యార్థుల పాలిట విద్యా పెన్నిధి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యా సంస్థల అధినేత చక్రవర్తి రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ చేత అందరి అభిమానంతో ఎన్నుకోబడ్డ ప్రజా నాయకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని ఎస్వీయూలో వైఎస్ఆర్‌సిపి విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డాక్టర్ బి. ఓబుల్ రెడ్డి, లెక్కల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిపాలన భవనం ఎదుట కేక్‌కట్ చేసి, టపాసులు పేల్చి స్వీట్లు పంచుకుని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎస్‌డిహెచ్‌ఆర్ విద్యా సంస్థల అధినేత చక్రవర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి యొక్క ఉజ్వల భవిష్యత్తు కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి వారికి మార్గదర్శంగా నిలిచాడన్నారు. అనంతరం వైసిపి విద్యార్థి, యువజన విభాగం నేతలు డా. బి. ఓబుల్ రెడ్డి, లెక్కల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నేడు ఎస్వీయూలోని నిరుపేద, మధ్య తరగతి విద్యార్థుల అందరి మధ్య జగనన్నకు పాలాభిషేకం చేసి, ఎంతో ఆర్భాటంగా ఉత్సాహంగా, ఉల్లాసంగా కేక్‌ని కట్ చేసి, స్వీట్లు పంచుకుని, టపాసులు పేల్చి గొప్ప సంబరాలను నిర్వహించుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి విద్యార్థి సంఘం యూనివర్సిటీ అధ్యక్షులు మణి, విద్యార్థి సంఘం నేతలు ప్రశాంత్, ప్రదీప్, నాగరాజు, భాష, విజయ ముని రెడ్డి, ప్రేమ్ కుమార్ రెడ్డి, హేమంత్, మహేంద్ర నాయక్, నరేంద్ర, కేదార్, సుంకురవి, రామలింగారెడ్డి, దినేష్, భార్గవ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్వీయూలో మొక్కలు నాటిన అధికారులు

తిరుపతి (క్రీడా), డిసెంబర్ 21, ప్రభాతవార్త



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పలుచోట్ల ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి, రెక్టార్‌ఆచార్యవి.శ్రీకాంత్‌రెడ్డి, రిజిస్ట్రార్‌ఆచార్య మహమ్మద్ హుస్సేన్ మొక్కలు నాటారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య పద్మనాభం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్, కామర్స్, మేనేజ్మెంట్ కళాశాలల సేవా వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా, జ్ఞాన ప్రద వెంకటేశ్వర స్వామి గుడి పక్క అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యు లు మధు, పరమగీతం, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు పరిశోధకులు పాల్గొన్నారు.

## వాడవాడలా జగనన్న జన్మదిన వేడుకలు

పుత్తూరురూరల్, డిసెంబరు 21 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని 14 పంచాయతీల్లో జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే పలు చోట్ల అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని పంచాయతీలు చెందిన వైసీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో వైసీపీ నాయకుడు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న జన్మదిన వేడుకలు నిర్వహించారు. గోపాలకృష్ణాపురం, పుత్తూరుమండలంతదుకుపంచాయతీలోజగన్‌జన్మదినవేడుకలుఘనంగానిర్వహించా రు

## ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

వడమాలపేట, డిసెంబరు 21 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. వడమాలపేటలోని జాతీయ రహదారిలో కేక్ కత్తిరించి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలోఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్‌లు మంజుల బుజ్జిరెడ్డి, అంజమ్మ, శ్రీవిద్య, రవి, ధర్మయ్య, తులసి రవిరెడ్డి, రాజేశ్వరి, శేఖర్, సుధీర్‌రెడ్డి, ఉమాపతి, మునిబాబు, కిరణ్, బాబుసాహెబ్, మునిశేఖర్, రమేష్‌రాజు, రాజశేఖర్, వెంకటేష్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

నింద్ర, డిసెంబరు 21 ప్రభాతవార్త :



మండలంలోని కొప్పేడులో వైకాపా సీనియర్ నాయకులు, యంపిటిసి రెడ్డివారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని కేక్ కట్ చేసి 400 మందికి అన్నదానం చేశారు. అలాగే మండల కేంద్రంలో యంపిపి దీపా జలంధం రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేసారు. కార్యక్రమంలో జడ్పీటిసి మల్లీశ్వరి , మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణరెడ్డి, వైస్ యంపిపి దుర్గాదేవి, యంపిటిసిలు మంజుల, విజేష్, సర్పంచ్‌లు మనోహర్‌నాయుడు, బాలక్రిష్ణమ రాజు, జయచంద్రారెడ్డి, సూర్య, గోపినాయుడు, రాజేష్, సుబ్రమణ్యంరాజు, బాబురెడ్డి, జయమ్మ, నాయకులు మేరీజయరామ్, మురళీనాయుడు, శివలింగం, సెల్వంరెడ్డి, రాము, రామచంద్రారెడ్డి, దినకర్, తోయజాక్షి, ధనంజేయులురెడ్డి, కన్నయ్య, శివయ్య, దశరధనాయుడు, గోపి, నాధమునస్వామి పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డి అందరివాడు

రేణిగుంట, డిసెంబరు 21 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందరివాడని రక్షణ ట్రస్టు చైర్మన్ పి.బాల అన్నారు. జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రేణిగుంట పంచాయతీ కార్యాలయ ఆవరణలో రక్షణ ట్రస్టు ద్వారా బుధవారం ఉదయం ట్రస్టు చైర్మన్ బాల పంచాయతీ పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న ప్రజా నాయకుడిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని అభివర్ణించారు. పేద ప్రజల ఆశాజ్యోతి జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు.

## జగనన్న వ్యక్తి కాదు మహాశక్తి - బియ్యపు పవిత్రరెడ్డి

రేణిగుంట, డిసెంబరు 21 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు రేణిగుంట మండలంలో అనేక ప్రాంతాల్లో బుధవారం వైభవంగా జరిగాయి. రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద మండల వైకాపా ఇన్‌చార్జి పవిత్రరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికి పంచారు. దాదాపు రెండు వేల మందికి వైకాపా మండల, పట్టణ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని పవిత్రరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ వైకాపా అధ్యక్షుడు ప్రభాకర్, తారక రామానగర్ వైకాపా ఇన్‌చార్జి మన్యంశ్రీనివాసులురెడ్డి(ఎంఎస్ఆర్) వైకాపా సీనియర్ నేతలు దయాకర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, మండల వైకాపా మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, కో-ఆప్షన్ మెంబరు సుభాన్‌రాజా, వైకాపా మండల మైనారిటీ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, మండల వైకాపా మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ, పార్టీ నేతలు రామ్మోహన్, విశ్వనాథ్ యాదవ్, ముద్దరాయల్, దొడ్లమిట్ట బాబు, షఫీ ఉల్లా, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైకాపా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తారకరామానగర్‌లో వైకాపా ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎంఎస్ఆర్) తన మిత్ర బృందంతో కలసి కేక్ కట్ చేసి జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా రేణిగుంట చేరుకుని పవిత్రరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న జగన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్ కేక్ కట్ చేసి జగన్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మైనర్లు వాహనం నడిపితే నేరం

తిరుపతి క్రైం, డిసెంబర్ 21, ప్రభాతవార్త

ట్రాఫిక్ నిబంధనల నియమావళి పై విద్యార్థి దశ నుండే వారికి అవగాహన ఉంటే రోడ్డు ప్రమాదాలలో పాటు ర్యాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వంటి వాటిని నివారించవచ్చునే జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి వారి సూచనల మేరకు బుధవారం నగరంలో పలు విద్యా సంస్థలలో ట్రాఫిక్ నియమావళి పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.


**NOTICE**

1. Sri K. Kanakaraj, Prop. of M/s. Vijaya Advertisaers, D. No. 6-2-95/A2, Old Maternity Hospital Road, Tirupati, Chittoor District, A.P
2. Smt. K Kumari W/o. K. Kanakaraj, D. No. 6-2-95/A2, Old Maternity Hospital Road, Tirupati, Chittoor District, A.P
3. Ms/. Vijaya Advertisers, Rep., by its Prop. Sri K. Kanakaraj, D. No. 6-2-95/A2, Old Maternity Hospital Road, Tirupati, Chittoor District, A.P

Re: MA No. 33/2022 OA No. 87/2015 (New OA No. 1972/2017) The Lakshmi Vilas Bank Limited (Now DSB Bank India Ltd) Vs. Sri K Kanakaraj and 2 others.

In the above referred matter the Proposed Applicant/Petitioner (Reliance ARC Ltd) has filed MA No 33/2022 for substituting the Reliance ARC in the Place of Original Applicant (DSB Bank India Ltd). The matter is coming up on 11-01-2023 before the Hon'ble Presiding Officer, DRT- II, Hyderabad. You No. 1 to 3 are therefore advised to appear before the Hon'ble DRT-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500 001 on 11-01-2023 at 10.30AM.

BY ORDER , DRT-II, Hyderabad

Place: Hyderabad
Date: 15-12-2022

Ms. Maanam Sailaja
Advocate, Flat No. 913, 9th Floor, Raghava Ratna Towers, Chirag ali Lane, Abids, Hyderabad 500 001.
Cell No. 9100919398.

**NOTICE**

1. Sri K. Kanakaraj, Prop. of M/s. Vijaya Advertisaers, D. No. 6-2-95/A2, Old Maternity Hospital Road, Tirupati, Chittoor District, A.P
2. Smt. K Kumari W/o. K. Kanakaraj,D. No. 6-2-95/A2, Old Maternity Hospital Road, Tirupati, Chittoor District, A.P
3. Ms/. Vijaya Advertisers, Rep., by its Prop. Sri K. Kanakaraj, D. No. 6-2-95/A2, Old Maternity Hospital Road, Tirupati, Chittoor District, A.P

Re: MA No. 37/2022 & MAIR No. 641/2022 in OA No. 87/2015 (New OA No. 1972/2017) The Lakshmi Vilas Bank Limited Vs. Sri K Kanakaraj and two others.

In the above referred matter the Applicant M/s. Lakshmi Vilas Bank Ltd., now (DSB Bank India Ltd ) has filed MA No. 37 of 2022 to condone the delay in filing the set aside petition and MAIR No. 641of 2022 filed for setting aside the dismissal Order dated 06-11-2017. The matter is coming up on 11-01-2023 before the Hon'ble Presiding Officer, DRT-II, Hyderabad. You No. 1 to 3 are therefore advised to appear before the Hon'ble DRT-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad 500 001 on 11-01-2023 at 10.30AM.

BY ORDER , DRT-II, Hyderabad

Place: Hyderabad
Date: 15-12-2022

Ms. Maanam Sailaja
Advocate, Flat No. 913, 9th Floor, Raghava Ratna Towers, Chirag ali Lane, Abids, Hyderabad 500 001.
Cell No. 9100919398.

## ముఖ్యమంత్రికి పాలాభిషేకం, పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 50వ జన్మదిన సంబరాలను బుధవారం శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి సారధ్యంలో ఘనంగా నిర్వహిం చారు. వైయస్‌ఆర్ సర్కిల్‌లోని ఒడాక్టర్ వైయస్ రాజ శేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద సామాజిక కార్యక్రమా లను ఏర్పాటు చేసారు. వైయస్‌ఆర్ విగ్రహా ంతో పాటు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పటాలకు నాయకులు పాలాభిషేకాలు నిర్వహించారు. నిరుపేదలు వేలాది మందికి అన్నదానం జరిపారు. ఈకార్యక్రమాలను శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పర్యవేక్షించారు. కేక్ కట్‌చేసి పేదలకు పంచిపెట్టారు. అన్నదానాన్ని శ్రీనివాసులు ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులతో పేదల గుండెల్లో దేవుడుగా నిలిచాడన్నారు. ఈకార్యక్రమంలో పాలకమండలి సభ్యులు సాదనమున స్వామి, జయశ్యాం, ప్రత్యేక ఆహ్వానితులు పవన్,చింతామణి పాండు, వైకాపా నాయకులు పగడాల రాజు,గుమ్మడి బాలకృష్ణ చంద్రరాజు, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ సిరాజ్‌బాషా, లోకేష్ యాదవ్,నంద, పసల కుమారస్వామిచల్లా జయరామయ్య మహిళా నాయకురాలు, సాగిరాబీ, షర్మిలా ఠాగూర్, ఇందిర,ధనలక్ష్మీ, రెడ్డెమ్మ, టైలర్ అధ్యక్షుడు శ్రీనివాసులు వారి సహాచరులు తదితరులు పాల్గొన్నారు.

# తడలో పోటాపోటీగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు





తడ, డిసెంబర్ 21 ప్రభాతవార్త : తడలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు పోటాపోటీగా నిర్వహించారు. వైసీపీ ఏర్పడిన తర్వాత మండలంలోని నేతలందరూ ఒకేచోట వివిధ పార్టీ కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే బుధవారం మొట్టమొదటిసారి అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు కనిపించాయి. మండల కేంద్రం తడకండ్రిగలోని రెండు వేర్వేరుచోట్ల అది కూడా దగ్గరదగ్గరగా జగన్ జన్మదినోత్సవాన్ని జరిపారు. ఒకరు సాధారణ భోజనం పెడితే, మరొకరు బిరియాని వండి మరీ కార్యకర్తలకు వడ్డించారు. అన్నదాన కార్యక్రమాలకు నాయకులు పోటీలు పడటంతో పేదలకు కడుపు నిండింది. అయితే సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సొంత మండలం లోనే రెండు గ్రూపులుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. ఇటీవల సూళ్లూరుపేట నియోజకవర్గ కేంద్రంలో పట్టణ, గ్రామీణ పార్టీ నేతల మధ్య విభేదాలు పెరిగి పెద్దవై పలు మధ్యస్తాల దాకా వెళ్లాయి. ఆ ప్రభావం అక్కడి నేతలు తడ దాకా తీసుకొచ్చినట్లయింది. కలిసికట్టుగా ఉన్న ఈ మండలంలోనూ ఇటీవల పేట నేతల పెత్తనంతో రెండు గ్రూపులు తయార య్యాయి. బుధవారం ఉదయం ఎంపీపీ కొళవి రఘురెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జన్మదినోత్సవ వేడుకలను నిర్వహిస్తుంటే బోడిలింగాలపాడుకు చెందిన జయకుమార్‌రెడ్డి ఆధ్వర్యాన మరోచోట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కారూరుకు చెందిన కొళవి రఘు తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని బోడిలింగాలపాడు గ్రామం విస్తరించిన సెగ్మెంట్ నుంచి ఎంపిటిసిగా గెలిచి ఎంపిపి అయ్యారు. ప్రస్తుతం అదే సెగ్మెంట్ నుంచి జయకుమార్‌రెడ్డి పోటీ కార్యక్రమం జరపడం ప్రాధాన్యతను సంతరించు కుంది. రెండువర్గాలుగా నేతలు విడిపోయినా మండలంలోని కొందరు పార్టీ నాయ కులు ఈ రెండు శిబిరాల్లోనూ కనిపించడం ఒక విశేషమైతే, ఎక్కువ గ్రామాలకు చెందిన నేతలు ఈ వర్గాల మధ్య తమకెందుకులే అనుకొని ఏకంగా సీఎం జన్మదిన ఉత్సవాలకే దుమ్మాకొట్టడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ గ్రూపులు బలపడక ముందే నియోజకవర్గ స్థాయి నతేలు జోక్యం చేసుకొని పరిష్కరించాలని పలువురు పార్టీ అభిమానులు అంటున్నారు.

# జననేత జగన్మోహన్‌రెడ్డి పేరున పేదలకు అన్నదానం



తిరుపతి,డిసెంబర్ 21 ప్రభాతవార్త: రాష్ట్రముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజున ఆయన పేరుపై పలువురు పేదలకు అన్నదానం చేశారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ శంకర్‌శాలినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అలిపిరి బస్టాండ్ వద్ద 50కిలోల కేక్ కట్‌చేశారు. అనంతరం ఇక్కడ పేదలకు, యాత్రికులకు అన్నదానం చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జగన్మోహన్‌రెడ్డిచేస్తున్న కృషిని కొనియాడారు. కులమతాలకు అతీతంగా జగన్ సంక్షేమ పథకాలు అమలుచేసి ప్రతి ఇంటా ఆనందం నింపుతున్నారని అన్నారు. అనంతరం పెద్దసంఖ్యలో పేదలకు జగన్ పేరున శంకర్‌నాయక్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి దళిత నేత ,ఎస్వీయూ పాలకమండలిసభ్యుడు మల్లారపు మధు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు కుసుమకుమారి, జివిఎస్, జిపిఎస్ నాయకులు డాక్టర్ కె.శంకర్‌నాయక్, ఎంతేజ నాయక్, బాపూజీ నాయక్, బి.రాజునాయక్, డి.భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**-వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో:**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం మధ్యాహ్నం వైఎస్ఆర్ ప్రజాప్రస్థానం సేవా ట్రస్ట్, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్ డాక్టర్ పిసి రాయలు కేక్ కట్ చేశారు. పేదల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో పేదలకు అన్నదానం చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌కే చెల్లుతుందన్నారు. వైఎస్ఆర్ ప్రజా ప్రస్థానం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జగన్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం పేదలకు టివిలు, న్యూట్రిషన్ ఫుడ్, వస్త్రదానం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదనరెడ్డి, గాదె సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా వ్యాప్తి దృష్ట్యా జాగ్రత్తలు అవసరం : డాక్టర్ శ్రీహరి



తిరుపతినగరం, డిసెంబరు 21 ప్రభాతవార్త : పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో వివిధ ఆరోగ్య కార్య క్రమాలపై డాక్టర్ యు.శ్రీహరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ కరోనా వ్యాధి 4వ వ్యాప్తి ప్రారంభ మయ్యే అవకాశం వుందని, ఈ కేసులు చైనాలో ఎక్కువగా వుందని, మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో కేసులు పుట్టుకొస్తున్నాయన్నారు. వైద్యాధికారులందరూ కోవిడ్ నియమ నిబంధనలు పాటిస్తూ అందరూ పాటించేలా చూడాలన్నారు. కరోనా లక్షణాలు కనిపిస్తే అందరికీ రాపిడ్ టెస్ట్ ద్వారా పరీక్షలు నిర్వహిం చాలన్నారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు ర్యాపిడ్ టెస్ట్ కిట్లకు గాను జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌సి డిసిడి డాక్టర్ కిరణ్‌ను సంప్రదించాలన్నారు. యుక్తవయస్సులో బాలబాలికలకు వచ్చే ఆరోగ్య సమస్యలకుగాను రక్తహీనత పరీక్షలు నిర్వహించి, వారికి తగిన వైద్య సహాయం అందించాలన్నారు. జిల్లాలో డిసెంబర్ 17 నుంచి జీరో మెటర్నల్ డెత్‌వీక్ జరుగుతున్నదని, మన జిల్లాలో మాతృ మరణాలు జరగకూడదన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రాష్ట్రస్థాయి అధికారులు, ప్రిన్సిపల్ స్థాయి అధికారులు ఎస్‌డిజిలోని సూచికలపైన గ్రామ స్థాయికే వచ్చి పరిశీలిస్తున్నారని, లోపాలుంటే అక్కడిక్కేడే ఛార్జ్ మెమోలు ఇస్తున్నారని, జాగ్రత్తగా పనిచేయాలని సూచించార. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ శాంతకుమారి, డిపిఎం డాక్టర్ శ్రీనివాసరావ్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతి చెందిన 13 మంది కుటుంబ సభ్యులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు



చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త: ప్రజా రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు 13 మందికి బుధవారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు వివిధ శాఖల్లో ఉద్యోగ నియాకమ ఉత్తర్వులు అందించారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా రవాణా శాఖలో మృతి చెందిన 13 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వివిధ శాఖల్లో ఉద్యోగ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఉద్యోగాలు పొందిన కుటుంబసభ్యులు తల్లిదండ్రుల స్ఫూర్తి, నిబద్ధతతో విధులు నిర్వర్తించి వారి ఆత్మకు శాంతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్, జిల్లా ప్రజా రవాణా అధికారి జితేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు



చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త: డిసిసిబి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులు, సిబ్బంది ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించు కొన్నారు. ఈ సందర్భంగా డిసిసిబి ఛైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి డిసిసిబి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగుల సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి సిఇఓ మనోహర్‌గౌడు, డిజిఎం కెవి చలపతి, జిఎం లిల్లీ క్యాథరిన్, ఎజిఎంలు కిరణ్‌కుమార్, సురేష్, చిత్తూరు బ్యాంకు మేనేజర్ రఘు, రిటైర్డ్ మేనేజర్ డి.రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## మరిదిని కత్తితో నరికి వదిన

చౌడేపల్లి, డిసెంబర్ 21 ప్రభాతవార్త : మరిదిని కత్తితో దాడి చేసి గాయపరచిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు..మండలంలోని దిగువపల్లి పంచాయతీ షికారి పాళెంకు చెందిన మల్లేష్‌కుమార్, ప్రమీలు ఇంటి ముందు నీటిపారుదల విషయంలో గొడవ పడ్డారు. గొడవ ముదిరడంతో ప్రమీల కత్తితో ఆమె మరిది అయిన మల్లేష్‌కుమార్‌పై దాడిచేసి గాయపరచింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సీఎం జన్మదిన వేడుకలను పండుగలా జరుపుకుంటున్నారు : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబర్ 21 ప్రభాతవార్త: సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను రాష్ట్ర ప్రజలు ఇంటి పండుగ వలె జరుపుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వెంకటగిరి పట్టణం తహసీల్దారు కార్యాలయం కూడలి వద్ద ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలోని కూడలిలో ఎమ్మెల్యే ఆనం కేక్ కట్ చేసి సంబ రాలు నిర్వహించారు. పేదలకు బిరియానీ పం పిణీ చేశారు. ఐదు దశాబ్దాల పాటు సీఎం జగన్ తన సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తనయుడుగా ఆయన మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. రాష్ట్రంలోని మూడు కోట్ల మంది ప్రజలకు సీఎం జగన్ మేలు చేసినట్లు వివరించారు. ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని కాపాడేందుకు యువత రక్తం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ దొంతు శారద, ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్‌ఛైర్మన్ బాలయ్య, ఉ మామహేశ్వరి, ఎంపీపీ తనూజారెడ్డి, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, న్యాయవాదుల సంఘం కార్యదర్శి కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

## ప్రజాహృదయనేత సిఎం జగనన్న : ఎమ్మెల్సీ భరత్

**-ఘనంగా సిఎం జన్మదినోత్సవం..అన్నదానం.. విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ**



కుప్పం, డిసెంబర్ 21 ప్రభాత వార్త : ప్రజాహృదయ నేత సిఎం జగనన్న అని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్య క్షుడు భరత్ పేర్కొన్నారు. బుధవారం కుప్పంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అధ్వర్యంలో ఘన ంగా నిర్వహించారు. ఈసందర్భ ంగా మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కోఛైర్మన్ జిఎస్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణలతో కలసి భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు.పేదలకు అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సిఎం జగనన్న నిండు నూరేళ్ల ఆయురా రోగ్యాలతో జీవించి మరింత ప్రజారంజక పాలన సాగించాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని చందం పంచాయతీలో ఆర్‌బికె భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర వని ్నయకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి,సలహాదారు ఆర్.శ్రీనివాసులు, కౌన్సిలర్లు రంగయ్య, గణపతి, నాగరాజు, సయ్యద్ అలీ, సోమశేఖర్, మణి, మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ పత్రాల మునిరత్నం, శేఖర్,మురళి, ఎంపిడిఒ జానకమ్మ, చందం సర్పంచ్ కుమారస్వామితో పాటు అధిక సంఖ్యలో నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు



కాణిపాకం, డిసెంబర్ 21 ప్రభాతవార్త: సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. బాబు ఆధ్వర్యంలో వైకాపా నాయకులు బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాణి పాకం ఆలయంలో సీఎం జగన్ పేరిట ఎమ్మెల్యే బాబు పాలాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అలాగే సీఎం జగన్ పేరుపై వేద పండితులచే ఆశీర్వచనం చేయించారు. ఈసందర్భంగా కాణిపాకం ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే కాణిపాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశులు ఘనంగా స్వాగతం పలికారు. ఇదిలా వుండగా స్థానిక పాత సంతగేటు జగన్ సన్మదినం సందర్భంగా కేక్ క చేసి పంచిపెట్టారు. అలాగే పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, స్థానిక వైకాపా నాయకులు రవిచంద్రారెడ్డి, చిన్నారెడ్డి, పుణ్యసముద్రం రవిప్రసాద్, వినోద్, సురేష్‌రెడ్డి, గోపీనాధన్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు గోల్డెన్ అవార్డు



చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త: చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌కు గోల్డెన్ అవార్డు లభించింది. ఏపి స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ 2022 సంవత్సరానికి ఎనర్జీ కన్వర్వే షన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన సంస్థలకు ఎనర్జీ కన్వర్వేషన్ అవార్డులు ప్రదానం చేసింది. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో 100 కెడబ్ల్యు సోలార్ పవర్ ప్లాంట్, ఎల్ఇడి లైట్ల వాడకం ద్వారా ప్రతి ఏడాది లక్ష యూనిట్ల విద్యు త్‌ను అదా చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వున్న సంస్థల్లో స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా చేపట్టిన సర్వేలో చిత్తూరు ఎపిఎస్ ఆర్టీసీ బస్టాండ్ గోల్డెన్ అవార్డు దక్కించుకొంది. ఈ అవార్డును మంగళవారం విజయవాడలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ విజయానంద్, ఏపి స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ సిఇఓ ఎ.చంద్రశేఖర్‌రెడ్డిలు చిత్తూరు టు డిపో మేనేజర్ రూపశ్రీకి ప్రదానం చేశారు.

## వైకాపా ప్రభుత్వంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు : జెడ్పీ ఛైర్మన్



పెద్దపంజాణి,డిసెంబరు 21 ప్రభాతవార్త: వైకాపా ప్రభుత్వంలో విద్యార్థులకు బంగారు భవిష్యతుగా మారిందని జెడ్పి ఛైర్మన్ శ్రీనివా సులు, ఎమ్మెల్యే డా.వెంకటేగౌడ తెలిపారు.ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా మండలంలో 8వ తరగతి విద్యార్థులకు,టిచర్లకు ప్రభుత్వం అందించిన ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు విద్యార్థుల భవిష్యత్తును దృషిలో ఉంచుకుని వారికి అమ్మ ఒడి,నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందిం చటానికై ట్యాబ్‌లను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి,ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పీటీసి సుష్మాకీర్తి,వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్ శంకరప్ప,జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళీరెడ్డి అకాల మరణం బాధాకరం : ఎమ్మెల్యే



రేణిగుంట, డిసెంబరు 21 ప్రభాతవార్త: టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్ర మౌళీరెడ్డి మృతి తీవ్ర దిగ్బ్రాంతికి గురి చేసిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి అన్నారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కార్డియాక్ అరెస్టుకు లోనై చికిత్స పొందుతూ చంద్రమౌళీరెడ్డి బుధవారం మృతి చెందాడు. ఆయన పార్థీవదేహాన్ని కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిమిత్తం అంబులెన్స్‌లో వారి స్వగ్రామం కర్నూలు పారుమంచాల తరలించేందుకు బయలుదేరారు. మార్గ మధ్యంలో రేణిగుంట మండలం కరకంబాడి కట్ట పుట్టాలమ్మగుడి సమీపంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, పార్థీవదేహానికి నివాళులర్పించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డిని ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో తారక రామానగర్ వైకాపా ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి, పలువురు మండల వైకాపా నేతలు ఉన్నారు.

## వైభవంగా జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలు



నగరి, డిసెంబరు 21 ప్రభాతవార్త : ముఖ్య మంత్రి జగనో ్మహనరెడ్డి జన్మదిన వేడుకలు మున సిపల్ కమిషనర్ కమలాపురం వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఘనంగా జరిగాయి. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా సోద రుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ముఖ ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన, కమిషనర్ ఇరువురూ కేక్ తినిపించుకున్నారు. ఈ నెల 20వ తేదీన నిర్వహించిన ఆటల పోటీల్లో సచివా లయ సిబ్బందికి బహుమతులు అందించారు. మునిసిపాలిటీ పనిచేసే సిబ్బంది, కార్మికులకు భోజనం పెట్టారు. సిబ్బంది శ్రీనివాసులు, చంద్రకాంత్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

**రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...**

ముఖ్యమంత్రి పుట్టినరోజును పురస్కరించుకుని మంత్రి ఆర్.కె.రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బుధవారం భారీ ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి ఓం శక్తి ఆలయం సమీపంలో దివంగత సిఎం రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి కేట్ కట్ చేశారు. అనంతరం మంత్రి నివాసం వద్ద ట్రస్ట్ ద్వారా గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు పేదలకు 3000 సిమెంట్ బస్తాలు, వైద్య చికిత్స నిమిత్తం రూ. 50 వేలు, క్రికెట్ కిట్లు, డ్రమ్స్, ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ నీలమేఘం, వైస్ ఛైర్మన్లు బాలాజీ, వెంకటరత్నం, నగరి, నిండ్ర, పుత్తూరు ఎంపిపిలు భార్గవి, దీప, మునివేలు పలువురు నాయకులు పాల్గొన్నారు. టవర్ క్లాక్ సెంటర్‌లో రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శాంతి, గుంతకల్లు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కె.జె.కుమార్ ఆధ్వర్యంలో అవయవ దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో 2వ స్థానంలో పుంగనూరు

చౌడేపల్లి, డిసెంబర్ 21 ప్రభాతవార్త : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పుంగనూరు నియోజకవర్గ మహిళా కబడ్డీ జట్టు 2వ స్థానంలో నిలచిందని పిడి రామచంద్ర తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురష్కరించుకొని విజయవాడలో రాష్ట్రస్థాయి జగనన్న క్రీడా సంబరాలు జరిగాయి. ఇందులో పుంగనూరు మహిళా జట్టు ద్వితీయ స్థానం సాధించి రూ. 3లక్షల నగదు బహుమతిని గెలించిందని ఆయన వివరించారు.

## శివయ్య సేవలో మహానంది ఈఓ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 21 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి బుధవారం మహానంది ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి దర్శనానికి విచ్చేశారు. స్వామిఅమ్మవార్ల దర్శ నం అనంతరం వారికి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌రెడ్డి ఏపిఆర్ఓ సుధాకర్, వేదపండితులు అవినాష్‌శర్మ, శాస్త్రిశర్మ, హేమంత్‌కృష్ణలు పాల్గొన్నారు.

## డిసిసిబిలో ఘనంగా సిఎం పుట్టినరోజు



చిత్తూరు, డిసెంబర్ 21 ప్రభాతవార్త: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బుధవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 50వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిసిసిబి బ్యాంకు ఛైర్మన్ రెడ్డమ్మ కృష్ణమూర్తి కేక్ కట్ చేసి డిసిసిబి అధికారులు, సిబ్బందికి పంచి పెట్టారు. బ్యాంకు పాలకవర్గ సభ్యులు కరుణాకర్‌చౌదరి, బాలసుబ్రమణ్యం, హరినాధరెడ్డి, ఊరప్ప, మస్తాన్ సాహెబ్, అరుణమ్మ, బ్యాంకు సిఇఓ మనోహర్‌గౌడ్, బ్యాంకు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే సిఎం లక్ష్యం:ఎమ్మెల్యే



తొట్టంబేడు, డిసెంబర్ 21 ప్రభాతవార్త : నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తొట్టంబేడు పంచాయతీ బీడికాలనీలో నిర్మాణాలు పూర్తయిన ఇండ్లకు సామూహిక గృహప్రవేశాల కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈసందర్భం గా ఆయనకు ఎంపిపి ఉన్నం నిర్మల, వాసుదేవ నాయుడు, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ సుబ్బయ్యలతో పాటు మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. కాలనీలో తొలుత పెద్దకన్నలి గ్రామానికి చెందిన ఎన్. రమణారెడ్డి ఇంటిని రిబ్బన్‌కట్‌చేసి ప్రారంభిం చడంతో పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్విచ్ ఆన్‌చేశారు. అనంతరం భువనేశ్వరి, మరి కొంతమంది మహిళల ఇండ్లను ప్రారంభించి సభావేదిక వద్దకు విచ్చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బీడి కాలనీ ఎంత దుర్భర పరిస్థితుల్లో ఉండేదో అందరికీ తెలుసని అయితే ప్రస్తుతం నేడు ఇది మిని శ్రీకాళహస్తిలా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ 8పంచాయతీలకు చెందిన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో వారి సొంత ఇంటికల నెరవేరింద న్నారు. రేణిగుంట టౌన్‌లోనే 12వేల మందికి ఇంటి స్థలాలను అందించామన్నారు. అంతేకాకుండా శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రిని రూ.16కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. బీడికాలనీకి 'జనగన్న కాలనీ'గా పేరుమార్చామని అందుకు తగిన ఉత్తర్వులు కూడా వచ్చాయన్నారు. మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవ నాయుడు మాట్లాడుతూ గతంలో బీడికాలనీలో ఎవ్వరు ఉండాలన్న ముందుకు వచ్చేవారు కాదని ఎంఎల్‌ఏ సహకారంతో తాను దగ్గర ఉండి శిధిలావస్థలో ఉన్న కాలనీని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. రైతులు పండించిన పంటకు మిల్లర్లు మధ్యవర్తులుగా కాకుండా ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలుచేసి ఎఫ్‌సిఐకి తరలించే విధంగా ఉండాలని ఎంఎల్‌ఏను కోరారు. సర్పంచ్ సుబ్బయ్య మాట్లాడుతూ ఎంఎల్‌ఏ ఆదేశిస్తాడు. ఈ సుబ్బయ్య ఏపనైనా ప్రజలకోసం కష్టపడి చేస్తాడు అని పేర్కొన్నారు. అనంతరం ఎంఎల్‌ఏను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోవి చంద్రయ్య నాయుడు, సర్పం చ్‌లు కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి గరటారెడ్డి, నాయకులు శోభన్‌నాయుడు, మునిరత్నం, హరిబాబు, భాస్కర్,రాఘవులు, ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్, ఆనందబాబు, చెంచ య్య, తదితరులుతోపాటు తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం, డిప్యూటీ తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, విద్యుత్ శాఖాధికారులు సతీష్‌బాబు, సుబ్రమణ్యం, బాలాజీ, విఆర్ఓలు, మండల నాయకులు పాల్గొన్నారు.